## క్లుప్తంగా

### ఎరువుల దుకాణాల్లో రైతుల రద్దీ



ఎరువుల దుకాణం వద్ద బారులు తీరిన రైతులు

నారాయణఖేడ్: వానాకాలం సీజన్‌కు సంబంధించి ముందస్తుగానే వర్షాలు కురిశాయి. ఆదివారం మృగశిర కార్తె ప్రవేశించడంతో సోమవారం పట్టణంలో ఎరువులు, విత్తనాల కొనుగోలు దుకాణాల్లో రైతుల సందడి నెలకొంది. ఇప్పటికే దుక్కిదున్ని, పొలాలను విత్తడానికి సిద్ధంగా ఉంచుకున్న రైతులు అవసరమైన పత్తి, జొన్న, పెసర, మినుము, కంది, విత్తనాలను కొనుగోలు చేయడానికి దుకాణాల వద్దకు చేరుకోవడంతో రద్దీ నెలకొంది.

### ఇద్దరు ఎస్‌ఐలకు సీఐలుగా పదోన్నతి



సీఐ ర్యాంక్ చిహ్నం తొడుగుతున్న ఎస్పీ

సంగారెడ్డి జోన్: అధికారులకు పదోన్నతి లభించడంతో మరింత బాధ్యత పెరుగుతుందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఎస్‌ఐలకు సీఐలుగా పదోన్నతి కల్పిస్తూ మల్టీజోన్ 2 ఐజీ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో పదోన్నతి పొందిన ఎస్‌ఐలు వెంకట్‌రెడ్డి, ప్రసాద్‌రావులకు జిల్లా ఎస్పీ సీఐ ర్యాంక్ చిహ్నంను తొడిగారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

### రాజీయే రాజమార్గం

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానిచంద్ర**




మాట్లాడుతున్న భవాని చంద్ర

సంగారెడ్డి టౌన్: రాజీమార్గంలో కేసులు త్వరగా పరిష్కరించుకోవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానిచంద్ర తెలిపారు. సోమవారం జిల్లా కోర్టులో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. క్రిమినల్ కాంపౌండ్, ఎక్సైజ్, డ్రంకెన్ డ్రైవ్, భూతగాదాలు, బీమా వంటి కేసులను పరిష్కరించడానికి పోలీసులు, అధికారులు కృషి చేయాలన్నారు.

### ఖేడ్‌లో కుండపోత



జాతీయ రహదారిపై పారుతున్న వరదనీరు

నారాయణఖేడ్: డివిజన్ పరిధిలో సోమవారం ఉదయం రెండు గంటల పాటు ఎడతెరపి లేకుండా కుండపోతగా వర్షం కురిసింది. మనూరులో 42.4 మి.మీలు, ఖేడ్‌లో 35, నాగల్గిద్దాలో 34.6, నిజాంపేటలో 27.4, కంగ్టిలో 24, సిర్గాపూర్‌లో 9.4, కల్హేర్‌లో 6.8 మి.మీలుగా నమోదైంది. మనూరు, ఖేడ్, నాగలిద్ద మండలాల్లోని ఆయా వాగుల్లోకి భారీగా వరద నీరు చేరింది. ఖేడ్ పట్టణంలోని జాతీయ, ప్రధాన, అంతర్గత రోడ్లపై భారీగా వరదనీరు పారింది.

### ఆధునిక పద్ధతులతో మేలు



అవగాహన కల్పిస్తున్న ఏఓ సారిక

రాయికోడ్(అందోల్): పంటల సాగులో ఆధునిక పద్ధతులు పాటిస్తేనే అధిక దిగుబడులు పొందే అవకాశం ఉంటుందని మండల వ్యవసాయ అధికారి సారిక అన్నారు. వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు విజయలక్ష్మి, పద్మ, ఉద్యానాధికారి మౌనిక సోమవారం రాయికోడ్‌లోని రైతువేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో రైతులకు సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ పంట దిగుబడులు పొందడానికి అధికారుల సూచనలు పాటించాలన్నారు. డీఏపీ యూరియా వినియోగం మోతాదుకు మించొద్దన్నారు. కార్యక్రమంలో వాసన్ సంస్థ సభ్యుడు బక్కారెడ్డి, ఏఈఓలు నిఖిల్, శివ, కల్పన, దీపిక, భావన , రమేష్, రైతులు పాల్గొన్నారు.

# రైతుల్లో చిగురించిన ఆశలు

మండలంలో కురుస్తున్న వర్షాలకు రైతన్నలలో పంటల సాగుపై ఆశలు చిగురిస్తున్నాయి. నెలరోజుల క్రితం నుంచే భూములను దుక్కి దున్నుకొని పంటలు సాగుకు సమాయత్తం చేశారు. అప్పటి నుంచి వర్షం ఎప్పుడు వస్తుందా.? అని ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు.

- వ్యవసాయ పనుల్లో బిజీబిజీ
- అత్యధికంగా పత్తి పంట సాగు
- పంటలకు అనుకూల వాతావరణం



చినిగెపల్లిలో మొలకెత్తిన పత్తి పంట

న్యాల్‌కల్(జహీరాబాద్): అల్పపీడన ప్రభావం, ముందస్తు రుతుపవనాల రాకతో మేలో వానలు కురిశాయి. అకాల వర్షాల వల్ల రైతుల్లో ఆశలు చిగురించాయి. కొంతమంది రైతులు పంటల సాగుకు శ్రీకారం చుట్టగా మరికొంత మంది రైతులు వేచి చూస్తున్నారు. విత్తిన విత్తనాలు కూడా మొలకెత్తాయి. 15 రోజుల నుంచి వర్షాల జాడ లేకపోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. సోమవారం కురిసిన వర్షంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. పంటలకు ప్రాణం పోసినట్లు అయిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**ఈ ఏడాది 7.18లక్షల ఎకరాల్లో సాగు..**

ఈ ఏడాది వానాకాలంలో జిల్లాలో 7.18 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేసుకునే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. అత్యధికంగా 3.64లక్షలు ఎకరాల్లో పత్తి, 1.51లక్షల ఎకరాల్లో వరి, 79వేల ఎకరాల్లో కంది, మిగిలిన 1.20లక్షల ఎకరాల విస్తీర్ణంలో పెసర, మినుము, సోయా తదితర పంటలు సాగయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు.

**మేలో అధిక వర్షం కురవడంతో...**

జిల్లాలో గత మే నెలలో వానలు బాగా కురిశాయి. 24 మిల్లీ మీటర్ల వర్షం కురవాల్సి ఉండగా 145 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. కురవాల్సిన వర్షం కంటే ఆరు రేట్లు ఎక్కువ కురిసింది. దీంతో కొంత మంది రైతులు గత నెలలోనే పత్తి విత్తనాలను విత్తుకున్నారు. విత్తుకున్న విత్తనాలు మొలకెత్తాయి. ప్రస్తుతం వర్షం కురవడంతో పత్తి పంటకు ప్రాణం పోసినట్లయింది. పంటలు వేసుకునేందుకు వాతావరణం అనుకూలంగా ఉండడంతో పత్తి వేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. సోమవారం ఉదయం రైతులు, కూలీలు పొలం బాట పట్టారు. పొలాల్లో ఎక్కడ చూసిన పత్తి విత్తనాలు వేసే కూలీలే కనిపించారు.



మిర్జాపూర్ శివారులో పత్తి విత్తుతున్న కూలీలు

**వర్షం పడడంతో..**



నాకు 9 ఎకరాల పొలం ఉంది. అందులో పత్తి పంటను వేసుకునేందుకు దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్నా. వర్షం పడకపోవడంతో విత్తనాలు విత్తుకోలేదు. సోమవారం వర్షం పడడంతో పత్తి విత్తనాలు విత్తుకుంటున్నా. ఒక్క రోజే 5 ఎకరాల్లో విత్తనాలు విత్తుకున్నాను.

– వెంకట్‌రెడ్డి రైతు, అత్నూర్, న్యాల్‌కల్

**పంటలకు మేలు**



ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల పంటలకు మేలు జరుగుతుంది. విత్తనాలు విత్తుకునేందుకు ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉంది. ఐదు రోజుల పాటు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ వానల వల్ల పంటలకు మించి ప్రయోజనం చేకూరుతుంది.

– విజయ్‌కుమార్ శాస్త్రవేత్త, బసంత్‌పూర్

## హెచ్‌ఎం రామకృష్ణకు అభినందనలు



రామకృష్ణను అభినందిస్తున్న కలెక్టర్ క్రాంతి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని నిజాంపూర్(కే) ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ ఈనెల 5న రాష్ట్రస్థాయి గ్రీన్ ఛాంపియన్ అవార్డును మంత్రి సురేఖ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రామకృష్ణను జిల్లా, మండలస్థాయి అధికారులను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వనరుల సద్వినియోగం, పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత అంశాల్లో హెచ్‌ఎం రామకృష్ణ, విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ సత్ఫలితాలు సాధించడంతో ప్రభుత్వం గుర్తించి అవార్డును అందజేయడం జిల్లాకు గర్వకారణమన్నారు. అలాగే, నిజాంపూర్(కే) ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాలతో రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, జిల్లా సెక్టోరియల్ అధికారి వెంకటేశం, ఏఎంఓ బాలయ్య, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, మండల విద్యాధికారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్ అండ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

పటాన్‌చెరు టౌన్: నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం నియోజకవర్గ పరిధిలోని 41 మంది లబ్ధిదారులకు మంజూరైన 19 లక్షల 85 వేల రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తూ వారి ఆర్థిక అభ్యున్నతికి అండగా ఉంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో గుమ్మడిదల మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహగౌడ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

**ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి**

జిన్నారం(పటాన్‌చెరు): ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు, అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో రూ.12.10 కోట్ల రూపాయల వ్యయంతో చేపడుతున్న బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. గుమ్మడిదల నగర కేంద్రం జాతీయ రహదారి నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు రూ. 42. 50లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఆత్మకమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ



ఇళ్ల సర్టిఫికెట్లను అందజేస్తున్న నాయకులు

సంగారెడ్డి : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు సోమవారం భూమి పూజ చేశారు. మండల్ తాద్దన్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ కమిటీ ఆధ్వర్యంలో మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశానుసారం ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. కాంగ్రెస్ నేత నత్తి దశరథ్ మాట్లాడుతూ.. తొలి విడతలో గ్రామంలో ఎనిమిది ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఇది నిరంతరమైన ప్రక్రియ అని విడతలవారీగా అర్హులందరికీ ఇళ్ల మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్, హౌసింగ్ ఏఈ శ్రీదేవి, గ్రామపంచాయతీ సెక్రటరీ సిద్ధమ్మ, మండల మైనార్టీ ప్రెసిడెంట్ ఎండీ మౌలానా, మాజీ ఎంపీటీసీ ఈశ్వర్‌గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీహరి, కాంగ్రెస్ మండల నాయకులు గణేష్ , గ్రామశాఖ ఉపాధ్యక్షుడు బాలరాజ్ పాల్గొన్నారు.

## అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

**విజిలెన్స్ ,ఎన్ఫోర్స్‌మెంట్ ఏఐజి మధుకర్**



తనిఖీలు చేపడుతున్న విజిలెన్స్ అధికారులు

వట్‌పల్లి(అందోల్): రైతులకు ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఐజీ మధుకర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మర్వెల్లిలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్ వివరాలు ,రసీదు పుస్తకాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దుకాణాల్లో ఎరువులు, విత్తనాల ధర పట్టికను ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యాపారులు కల్తీ విత్తనాలు అమ్మకూడదని ప్రభుత్వ గుర్తింపు ఉన్న నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలని సూచించారు. విజిలెన్స్ ఏఓ కోటేశ్వర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## రేషన్ కోసం పడిగాపులు

- పలుచోట్ల సాంకేతిక సమస్యలు
- సర్వర్ల మొరాయింపు



రేషన్ దుకాణం వద్ద లబ్ధిదారులు

సంగారెడ్డి క్రైమ్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆహార భద్రత కార్డు లబ్ధిదారులకు మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ చేస్తుండటంతో రేషన్ దుకాణాల వద్ద ఉ.6 నుంచే ప్రజలు క్యూల్లో ఉండి ప్రజలు బియ్యాన్ని తీసుకుంటున్నారు. రేషన్ త్వరగా తీసుకొని ఉద్యోగాలు, పనులకు వెళ్లొచ్చనే ఆశతో రేషన్ దుకాణాలకు వెళ్తున్నప్పటికీ వారికి నిరాశే ఎదురవుతుంది. పట్టణంలోని పలు రేషన్ దుకాణాల వద్ద సర్వర్ సమస్య తలెత్తడం, ఒకేసారి మూడు నెలలకు సంబంధించిన వేలిముద్రలు తీసుకోవడం, కొందరికి వేలిముద్రలు రాకపోవడం తదితర కారణాల వల్ల రేషన్ పొందలేక లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని చోట్ల సాంకేతిక సమస్యల కారణంగా కనీసం రోజుకు 50 మందికి కూడా రేషన్ పంపిణీ చేయలేకపోతున్నారు. లబ్ధిదారులు రేషన్ డీలర్లపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### నేడు ఓటర్ జాబితా అభ్యంతరాలపై సమావేశం

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని ఖాజిపల్లి, గడ్డపోతారం, మాదారం, వావిలాల, లక్ష్మీపతిగూడెం గ్రామాల్లో 18 వార్డులకు సంబంధించిన ఓటర్ జాబితాపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జైత్రంనాయక్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు ఓటర్ జాబితా అభ్యంతరాలపై మాజీ ప్రజా ప్రతినిధులు అఖిలపక్ష నాయకులు, యువకులు గ్రామ ప్రజలు నేడు11: 30 గంటలకు మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్వహించే సమావేశంలో వ్యక్త పరచవచ్చని తెలియజేశారు.

### మందుబాబులకు జరిమానా

సంగారెడ్డి క్రైమ్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ సుమన్ కుమార్ కథనం ప్రకారం సంగారెడ్డి ట్రాఫిక్ సీఐ ఆదివారం అర్ధరాత్రి సంగారెడ్డి పాత బస్టాంట్ వద్ద, అలాగే జాతీయ రహదారి, బైపాస్‌లోని గుర్రపు బొమ్మ వద్ద నిర్వహించిన తనిఖీల్లో 20మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఆయన చెప్పారు. వారిని సోమవారం సంగారెడ్డి జిల్లా న్యాయస్థానంలో హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్ధిఖీ ఆరుగురికి రూ.1500, మిగతా తొమ్మిది మందికి రూ.1000, మిగతా ఐదుగురికి రూ.500, చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీస్‌లు పేర్కొన్నారు.

## సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సంగారెడ్డి జోన్: గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్ సుధాకర్‌ను కలిసి సమస్యలపై వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కోశాధికారి ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, **SHAIK MEHBOOB JANI S/o. SHAIK MOINODDIN,** R/o. H.No. 1-35, Dhanwar Vill., Manoor Mdl., Sangareddy Dist. I Changed my name from Mahabujani Dudekula S/o. Mohinoddin Dudekula (Old name) to SHAIK MEHBOOB JANI S/o. SHAIK MOINODDIN (New Name) for all the Purposes.

**PUBLIC NOTICE**

This is to inform General Public that, Under the instructions of My Client **Sri.Golla Prabhakar**, S/o Late Golla Narayana, Resident of H.No.2-42, Thopugonda(V),Kandi(Mo)Sanga Reddy Dist - 502285 do hereby issue this notice as follows:My client **Sri.Golla Prabhakar** is an absolute owner and possessor of Agricultural land in Sy NO.55/E (More clearly described in schedule herein) having purchased through Registered Sale Deed **No.3597/1992** dated **14/09/1992** from **Sri. Kummari Venkaiah** S/o Pentaiah. My Client is in peaceful possession and enjoyment of the schedule property from the date of purchase.

The General Public are hereby informed that My Client Sri.Golla Prabhakar has lost the Original Sale Deed **No.3597/1992** dated **14/09/1992** while travelling in Bus on **03/06/2025** from Sanga Reddy Town to his residence at Thopugonda Village. My Client **Sri.Golla Prabhakar** has put his best efforts in tracing the said Registered Sale Deed **No.3597/1992** dated **14/09/1992** but his efforts went in vain. Finders of the said document may contact the undersigned within 7 days and hand over the same to the undersigned. Further, If, anybody/any person/s/Banks/Financial Institutions has/have any objection, claim, right, interest, dispute of whatsoever nature, in respect of the above said property, he/she/they may contact the undersigned with the documentary proof to substantiate his/her/their objection, claim, right, Title, interest, details of dispute/s within Seven (7) days from the date of the publication of this notice, failing which my Client will deem as if there were no objections/ claims/ details of disputes of any body/person/s and thereafter, no Claims or disputes will be entertained. **Property Schedule:** Agricultural land bearing Sy No.55/E, total area admeasuring AC.1-16 Guntas Dry land situated at Topgonda/Village,Sanga Reddy Mandal (Presently Kandi Mandal),Sanga Reddy Dist (Formerly Medak Dist) and bounded as follows:**North**:Land of Vittal Goud,**South**:Land of Anthaiah,**East**:Land of Vittalaiah,**West**:Land of Laxmamma.

**Sd/- E.A.SRIKANTH RAJU**
**Advocate**
#202,Sarala Apartments,
Umesh Chandra Statue Road,Beside Axis Bank,SRNagar,Hyderabad-38. Cell:9959631522

## డబుల్ ఇళ్లు అప్పగించాలని నిరసన



నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

జహీరాబాద్ టౌన్: డబుల్ బెడ్ రూం ఇళ్లను అప్పగించాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద లబ్ధిదారులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మహిపాల్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం హోతి(కె) గ్రామంలో పేదల కోసం ఇళ్లను కట్టించగా అధికారులు డ్రా ద్వారా లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారని చెప్పారు. రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇళ్లను అప్పగించడం లేదని వాపోయారు. రెవెన్యూ అధికారులు స్పందించి వెంటను ఇళ్లను అప్పగించాలని, లేనిపక్షంలో ఇళ్లను ఆక్రమించుకుంటామని హెచ్చరించారు. స్పందించిన తహసీల్దార్ దశరథ్ ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలో ఇళ్లను అప్పగిస్తామన్నారు. దీంతో ఆందోళన విరమించారు.

## మట్టి మేధావి సత్తయ్య పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ కౌన్సిలర్ భరత్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): దుబాయిలో గల్ఫ్ అంబేడ్కర్ రైట్స్ మూమెంట్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో తెల్లాపూర్ మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్ ముఖ్యవక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్. పసునూరి రవీందర్ రచించిన మట్టి మేధావి సత్తయ్య పుస్తకాన్ని గల్ఫ్ కార్మికుల మధ్య ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. భారతదేశ మహనీయులు చత్రపతి శివాజీ, జ్యోతిరావు పూలే, బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మహనీయుల చరిత్రను శ్రామిక, కార్మిక వర్గానికి తెలియజేశామని వివరించారు.

## బీసీలు రాజకీయంగా ఎదగాలి

**నీలం మధు ముదిరాజ్**

జిన్నారం (పటాన్‌చెరు): బీసీలు రాజకీయంగా ఎదిగినప్పుడే నిజమైన గుర్తింపు లభిస్తుందని ఎన్ఎంఆర్ యువసేన అధ్యక్షుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. సోమవారం జిన్నారం మండలంలోని శివానగర్ గ్రామంలో రూ.15 లక్షల సొంత నిధులతో నిర్మించిన ముదిరాజ్ భవనాన్ని స్థానిక నాయకులతో కలిసి నీలం మధు ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రేవంత్ సర్కార్ చేపట్టిన బీసీ కులగణనలో బీసీలందరూ పాల్గొని వినియోగించుకోవాలన్నారు. గతంలో ప్రభుత్వాలు ముదిరాజ్‌లను కేవలం ఓటు బ్యాంకుగా చూశారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీసీలకు పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వాకిటి శ్రీహరిని మంత్రివర్గంలో చోటు కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. ముదిరాజుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించడానికి సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

### జోరుగా పారిశుద్ధ్యం పనులు



అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

నారాయణఖేడ్: మున్సిపాలిటీలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా పారిశుద్ధ్య పనులు సోమవారం ముమ్మరంగా కొనసాగాయి. మంగల్ పేటలోని జాతీయ రహదారి పక్కనున్న మురుగు కాల్వలతో పాటు పలు కాలనీల్లోని పేరుకుపోయిన మురుగు, పొదలను తొలగించారు. దర్గాగల్లీలో తడి, పొడిచెత్తపై మహిళలకు శానిటరీ అధికారి శ్రీనివాస్ అవగాహన కల్పించారు.

## అపూర్వ ఆత్మీయ సమ్మేళనం

వట్‌పల్లి(అందోల్ ): అందోల్ మండల పరిధి నేరడిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–02లో పదవ తరగతి బ్యాచ్ సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 23 ఏళ్ల తర్వాత విద్యార్థులు, ఉపాధ్యాయులు ఒకే వేదికపైకి వచ్చి ఒకరినొకరిని ఆప్యాయంగా పలుకరించుకొని అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం వారికి పాఠాలు బోధించిన గురువులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం గురువులతో కలిసి భోజనం చేశారు.



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

## అధిక ఫీజులతో ప్రైవేట్ స్కూళ్ల దోపిడీ

**బీసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్**

పటాన్‌చెరు టౌన్: అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ అన్నారు. సోమవారం సంగారెడ్డిలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లను కలిసి వినతి పత్రం అందజేశారు. అనిల్ మాట్లాడుతూ.. జిల్లా పరిధిలో నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలో అధిక ఫీజుల వసూళ్లకు పాల్పడుతూ... విద్యను వ్యాపారంగా మారుస్తున్నారన్నారు. సీబీఎస్ఈ సిలబస్, ఇంటర్ నేషనల్ సిలబస్‌ల పేరుతో మరింత దోపిడీకి పాల్పడుతున్నారని మండిపడ్డారు. స్కూల్ యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, ట్రాన్స్‌పోర్ట్ పేరుతో లక్షల్లో దోపిడీ చేస్తున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400